ఎంసెట్ కాదు ఎప్‌సెట్

మే 9 నుంచి 13 వరకు ప్రవేశ పరీక్షలు

- మే 6న ఈసెట్, మే 23న ఎడ్‌సెట్, జూన్ 3న లా , జూన్ 4, 5తేదీల్లో ఐసెట్ ఎగ్జామ్స్
- జూన్‌లోనే పీజీఈసెట్, పీఈసెట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లు
- ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లు విడుదల
- గతంలోని వర్సిటీలకే పరీక్షల నిర్వహణ బాధ్యతలు
- రెండు రోజుల్లో కన్వీనర్ల పేర్లు ఖరారు

ఉన్నత విద్యామండలి ఆఫీసులో ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను విడుదల చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, వీసీలు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ పరీక్షాతేదీలు ఖరారయ్యాయి. ఈ పరీక్షలను మే 9 నుంచి 13 వరకు నిర్వహిస్తారు. ఈ ప్రవేశ పరీక్షను ఇదివరకు టీఎస్ ఎంసెట్‌గా పిలిచేవారు. ఇకనుంచి టీఎస్ ఎప్‌సెట్‌గా మారుస్తూ ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. విభాగాల వారీగా తీసుకొంటే మే 9 నుంచి 11 వరకు ఇంజినీరింగ్, మే 12, 13 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా విభాగం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను మరోసారి జేఎన్టీయూహెచ్‌కే అప్పగించారు. నిరుడు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి ముందుగా పరీక్షలు జరగ్గా, ఈ ఏడాది ఇంజినీరింగ్‌తో ఎప్‌సెట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఎప్‌సెట్ సహా రాష్ట్రంలో నిర్వహించే ఏడు ప్రవేశ పరీక్షల తేదీలను, నిర్వహించే వర్సిటీల వివరాలను ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, వర్సిటీల వీసీలు గురువారం ఆయా వివరాలను విడుదల చేశారు.

ఈసెట్‌తో ప్రారంభం

ఈ ఏడాది ప్రవేశ పరీక్షలు (సెట్స్) టీఎస్ ఈసెట్‌తో ప్రారంభంకానున్నాయి. ఈ ప్రవేశ పరీక్షను మే 6న నిర్వహించనుండగా, నిర్వహణ బాధ్యతలను ఉస్మానియా వర్సిటీకి అప్పగించారు. జూన్ 10 నుంచి 13 వరకు పీఈసెట్ పరీక్షలు జరుగుతాయి. ఎడ్‌సెట్ మే 23, లాసెట్ జూన్ 3, ఐసెట్ జూన్ 4, 5 తేదీల్లో, పీజీఈసెట్‌ను జూన్ 6 నుంచి 8 వరకు నిర్వహిస్తారు. ఇక ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను నిరుడు నిర్వహించిన వర్సిటీలకే తిరిగి అప్పగించారు. అయితే ఒక రిద్దరు కన్వీనర్లు మారే అవకాశం ఉన్నది. రెండు రోజుల్లో ప్రవేశ పరీక్షల కన్వీనర్ల పేర్లను ప్రకటించనున్నారు. పరీక్షలను మే నెలలోనే పూర్తిచేయాలని భావించినా అదే సమయంలో టీసీఎస్ సంస్థ ఇతర పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండటంతో జూన్ రెండో వారం వరకు వెళ్లాయి. ఇక ఎప్‌సెట్ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి రెండోవారంలో విడుదల చేసే అవకాశం ఉన్నది.

కెపాసిటీ పెంపు

ఒక్క ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్ (పీఈసెట్) మినహా అన్ని ప్రవేశపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. అయితే ఈ సారి పరీక్షలను తక్కువ సెషన్లలో, త్వరగా పూర్తిచేసేందుకు పలు చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా పరీక్షాకేంద్రాలు, సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు. గతంలో ఒక సెషన్‌లో 25వేల మందికి మాత్రమే పరీక్షలను నిర్వహించే అవకాశముండగా, ఈ సామర్థ్యాన్ని రోజుకు 35వేల మందికి పెంచారు. దీంతో పరీక్షలు త్వరగా పూర్తికానున్నాయి.

సెట్ కమిటీ సమావేశం తర్వాతే..

పీఈసెట్, పీజీఈసెట్‌లో పలు మార్పుల చేసేందుకు ఉన్నత విద్యామండలి కమిటీలను నియమించింది. పీఈసెట్‌లో లాంగ్, జంప్, హైజంప్, వెయ్యి మీటర్ల పరుగులను తొలగించాలని, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ ద్వారానే అడ్మిషన్లు కల్పించాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. ఇక పీజీఈసెట్‌లో తక్కువ మంది దరఖాస్తు చేసుకొన్న సబ్జెక్టులకు ప్రవేశపరీక్ష లేకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో అడ్మిషన్లు నిర్వహించేందుకు మరో కమిటీని నియమించారు. ఆయా సెట్ కమిటీ సమావేశాల్లో ఈ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వీటిపై తది నిర్ణయం తీసుకొని, ఆయా విషయాలను నోటిఫికేషన్‌లో పొందుపరుస్తామని అధికారులు తెలిపారు.

మార్పులిలా..

- ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్‌ను ఈ ఏడాది 100శాతం సిలబస్‌కు నిర్వహిస్తారు. నిరుడు ఫస్టియర్‌లో 70 శాతం, సెకండియర్‌లో 100 శాతం సిలబస్‌కు పరీక్షలుంటాయి.
- ఎంసెట్‌కు హాజరయ్యే జనరల్ క్యాటగిరీ విద్యార్థులు ఇంటర్ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో 45 శాతం, రిజర్వుడు క్యాటగిరీ విద్యార్థులు ఈ మూడు సబ్జెక్టుల్లో 40 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. కరోనా నేపథ్యంలో గతంలో మినహాయింపునిచ్చారు.
- ఎంసెట్‌లో ఇంటర్ వెయిటేజీని నిరుడు శాశ్వతంగా ఎత్తివేశారు. దీంతో విద్యార్థులు నిక్షేపంగా ఎప్‌సెట్‌పైనే దృష్టిసారించవచ్చు.
- ఎప్‌సెట్ సహా అని రకాల కోర్సుల్లో ఉమ్మడి రాష్ట్రం అడ్మిషన్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియనున్నది. ఈ ఏడాదితో ముగుస్తుందని భావించినా.. అంతలోపే నోటిఫికేషన్లు విడుదల కానుండటంతో ఓపెన్ కోటాలో 15శాతం సీట్ల అడ్మిషన్లకు ఈ ఒక్కసారికి ఏపీ విద్యార్థుల పోటీపడే అవకాశం ఉన్నది. మిగతా 85శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులతో నింపుతారు.

> **పరీక్షలు, ఫలితాల్లో తప్పులుండొద్దు**
>
> ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను ఖరారు సందర్భంగా ప్రభుత్వం వర్సిటీల వీసీలకు గట్టి హెచ్చరికలు జారీచేసింది. ఎలాంటివి జరిగినా అందుకు వర్సిటీల వైస్‌చాన్స్‌లర్లదే బాధ్యత అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం హెచ్చరించారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ, ఉస్మానియా, కాకతీయ వర్సిటీల వీసీలతో గురువారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ సందర్భంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల్లో.. ప్రశ్నపత్రాల్లో.. ఫలితాల వెల్లడిలో తప్పులు జరుగవద్దని స్పష్టంచేశారు.
>
> - బుర్రా వెంకటేశం

ఎంట్రెన్స్ టెస్ట్‌ల పరీక్షాతేదీలు

సెట్ (కోర్సులు)	పరీక్షాతేదీలు	నిర్వహించే వర్సిటీలు
టీఎస్ ఈసెట్ (బీటెక్, బీఎస్సీ గణితంలో ల్యాటరల్ ఎంట్రీ)	06-05-24	ఉస్మానియా
టీఎస్ ఈఏపీ సెట్ (ఇంజినీరింగ్)	09-05-24 నుంచి 11-05-24	జేఎన్టీయూహెచ్
(అగ్రికల్చర్, ఫార్మసీ)	12-05-24 నుంచి 13-05-24	
టీఎస్ ఎడ్‌సెట్ (రెండేండ్ల బీఈడీ)	23-05-23	మహాత్మాగాంధీ
టీఎస్ పీజీ లా, లా సెట్ (మూడు, ఐదేండ్ల లా, ఎల్ఎల్ఎం)	03-06-24	ఉస్మానియా
టీఎస్ ఐసెట్ (ఎంబీఏ, ఎంసీఏ)	04-06-24 నుంచి 05-06-24	కాకతీయ
టీఎస్ పీజీఈసెట్ (ఎంటెక్, ఎం ఫార్మసీ)	06-06-24 నుంచి 08-06-24	జేఎన్టీయూహెచ్
టీఎస్ పీఈసెట్ (బీపీఈడీ, యూజీడీపీఈడీ)	10-06-24 నుంచి 13-06-24	శాతవాహన

కిడ్నీ రోగులకు స్వాపింగ్‌తో ఊపిరి!

రెండోపేజీ తరువాయి...

వస్తున్నది. ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ, ఇతర త్రా ఇన్సూరెన్స్‌ల కింద ఉచితంగా సేవలు అందించినా భారమే. అందుకే కిడ్నీ మార్పిడికి అవకాశాలను మెరుగుపరచటం ద్వారానే రోగికి పునర్జన్మనిచ్చి, వారి కుటుంబానికి ఊరట కలిగించవచ్చు.

ఉన్నది ఆ రెండు మార్గాలే

కిడ్నీ దాతలు రెండు మార్గాల ద్వారానే లభిస్తారు. బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి కిడ్నీని సేకరించడం(కెడావర్), రోగి రక్త సంబంధీకులు ఎవరైనా ముందుకొస్తే వారి నుంచి కిడ్నీని సేకరించి మార్పిడి చేయటం. ఇందులో బ్రెయిన్‌డెడ్ కేసులు నమోదైనప్పుడే కిడ్నీ దొరుకుతుంది. ఇందుకోసం జీవన్‌దాన్‌లో రోగి పేరు నమోదు చేసుకుంటే, సీరియల్ ప్రకారం కెడావర్ కేసు వచ్చినపుడు కిడ్నీని ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం నిమ్స్ వేదికగా నిర్వహిస్తున్న జీవన్‌దాన్‌లో అత్యధికంగా వెయిటింగ్ జాబితా ఉన్నది కిడ్నీ రోగులదే. రెండో మార్గంగా, రోగి రక్త సంబంధీకులు ముందుకొచ్చినా ఇద్దరిదీ ఒకే బ్లడ్ గ్రూపు ఉండాలి. మ్యాచ్ కాకపోతే మార్పిడి అసాధ్యం. అయితే గత పదేండ్లుగా బ్లడ్ గ్రూప్స్ కలవకపోయినప్పటికీ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేసే ప్రత్యేక పద్ధతి 'ఏబీవో ఇన్‌కంపాటిబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అందుబాటులోకి వచ్చింది. కానీ సాధారణంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అయ్యే దానికంటే ఈ విధానానికి కనీసంగా రూ.3–4 లక్షల వ్యయం అదనంగా అవుతుంది. అందుకే మధ్య తరగతి కుటుంబాల వాళ్లు కెడావర్ కోసం ఎదురుచూస్తూ డయాలసిస్‌తో నెట్టుకొస్తున్నారు. అయితే డయాలసిస్ తాత్కాలిక ఉపశమనమే. పైగా కాలం గడిచేకొద్దీ రోగిలో రోగనిరోధకశక్తి తగ్గి ఇతర అవయవాలపై ప్రభావం పడుతుంది.

> **కేస్ 1**
>
> **ఒక కుటుంబంలో** తండ్రికి ఒక కిడ్నీ చెడిపోయింది. కిడ్నీ మార్పిడి తప్ప శాశ్వత పరిష్కారం లేదని వైద్య నిపుణులు తేల్చి చెప్పారు. తండ్రి మీద ప్రేమతో కొడుకు ఒక కిడ్నీని దానం చేసేందుకు ముందుకొచ్చాడు. కానీ తండ్రిది ఓ–బ్లడ్ గ్రూప్. కుమారునిది మాత్రం బీ–బ్లడ్ గ్రూప్. మ్యాచ్ కాదని వైద్యులు చెప్పేశారు. కిడ్నీ దాతల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎన్ని సంవత్సరాలకు తన వంతు వస్తుందో కూడా తెలియని విషమ పరిస్థితి. అంతకాలం డయాలసిస్‌తో ప్రాణం అరచేతులో పెట్టుకొని కాలం వెళ్లదీయాలి.

> **కేస్ 2**
>
> **మరో కుటుంబంలో** ఇదేరీతిన తండ్రికి కిడ్నీ చెడిపోయింది. ఇక్కడా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను వైద్య నిపుణులు సూచించగా, కిడ్నీ దానం కోసం కూతురు ముందుకొచ్చింది. అయినా పైకేసు మాదిరే ఇక్కడా తండ్రిది బీ–బ్లడ్ గ్రూప్, కూతురుది ఓ–బ్లడ్ గ్రూప్. ఈ కుటుంబం కూడా జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకొని, వారానికోసారి డయాలసిస్, నిత్యం మందులతో కాలం గడుపుతున్నారు. దాత దొరికేదెన్నడు? ప్రాణానికి గ్యారెంటీ లభించేదెన్నడు?

చీకటిలో చిరుదివ్వెలా స్వాప్

కిడ్నీ రోగులకు దాతల సంఖ్య పరిమితంగా ఉన్న ఈ తరుణంలో 'స్వాప్ (పెయిర్డ్) కిడ్నీ మార్పిడి' విస్తృతమైతే ఎంతోమంది ప్రాణాలు నిలబడతాయి. స్టార్ దవాఖాన నెఫ్రాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ గంధె శ్రీధర్ తొమ్మిదేండ్లుగా రిజిస్టర్ నిర్వహిస్తూ ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. సాధారణంగా ఒక వైద్యుడి విస్తృతి పరిమితంగా ఉంటున్నందున ఆయన ఇప్పటివరకు 3–4 వరకు స్వాప్ కిడ్నీ మార్పిడి చేయగలిగారు. అమెరికాలో ఏటా 30% స్వాప్ మార్పిడీలు ఉంటున్నాయని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఇందుకోసం అక్కడ 'నేషనల్ స్వాప్ రిజిస్ట్రీ' పేరుతో ఆన్‌లైన్ పోర్టల్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. మన దేశంలోనూ దీనిపై విస్తృత అవగాహన కలగాలని అంటున్నారు. ఫలితంగా కిడ్నీ దాతల లభ్యత 30–35 శాతానికి పెరుగుతుందని వివరిస్తున్నారు.

త్వరలో అందబాటులోకి వెబ్‌సైట్

స్వాప్ విధానంపై అవగాహన పెంచడంతో పాటు ఒక వేదికను కల్పించేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నట్టు డాక్టర్ శ్రీధర్ తెలిపారు. త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. దీని ద్వారా కిడ్నీ రోగులు తమ కుటుంబంలో దాత ఉండి, బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోతే ఈ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చని, తద్వారా దాతల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కూడా ఈ విధానంపై రోగుల్లో విస్తృతంగా అవగాహన పెంచడంతో పాటు ప్రస్తుతం నిర్వహిస్తున్న జీవన్‌దాన్‌కు సమాంతరంగా ఆన్‌లైన్‌లో 'స్వాప్' వేదికను నిర్వహిస్తే ఎంతో మందికి మేలు జరుగుతుందని సూచించారు.

> **కేస్ 1+కేస్ 2**
>
> **నిబంధనల** ప్రకారం కిడ్నీ రోగికి రక్త సంబంధం ఉన్న వారు మాత్రమే కిడ్నీని దానం చేయాలి. లేకపోతే జీవన్‌దాన్‌లో పేరు నమోదు చేసుకోవాలి. వాస్తవానికి పై రెండు ఉదాహరణల్లో కుటుంబసభ్యుల బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ, పరస్పరం మాత్రం బ్లడ్ గ్రూపులు మ్యాచ్ అవుతున్నాయి. దీంతో రెండు కుటుంబాలు పరస్పరం కిడ్నీ దానం చేసుకొంటే రెండు ప్రాణాలు నిలబడతాయి. దీనినే 'స్వాప్' విధానం లేదా పెయిర్డ్ కిడ్నీ ఎక్స్ఛేంజ్ అని అంటారు. ఇలాంటి కేసులకు ఒక వేదిక కల్పించటం ద్వారా ఎందరో కిడ్నీ రోగులు ప్రాణాపాయం నుంచి బయటపడతారు. చాలారోజుల నుంచి వ్యక్తిగతంగా ఇలాంటి ప్రయత్నం చేస్తూ పలువురి ప్రాణాలు కాపాడుతున్న స్టార్ దవాఖాన నెఫ్రాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ గంధె శ్రీధర్ ఒక బహిరంగ వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు త్వరలో స్వాప్ కిడ్నీ ఎక్స్ఛేంజ్ కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించబోతున్నారు.

పాఠశాల విద్యాశాఖ వాటా 15 వేల కోట్లు

- 29న డిప్యూటీ సీఎం ముందుకు బడ్జెట్ ప్రతిపాదనలు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌లో పాఠశాల విద్యాశాఖకు రూ.15 వేల కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించనున్నారు. వీటిలో జీతాలకే రూ.14,500 కోట్లు అవుతుందని అధికారులు తేల్చారు. రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో భాగంగా ఈ నెల 29న సచివాలయంలోడిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యాశాఖ అధికారులతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గత బడ్జెట్‌లో రూ.13వేల కోట్లిస్తామన్నారు, ఈ దఫాలో రూ.15 వేల కోట్లివ్వాలని అధికారులు ప్రతిపాదించనున్నారు. ఇక బడ్జెట్ ప్రతిపాదనల సమావేశం ఈ నెల 27న జరగాల్సి ఉండగా, ఈ నెల 29కి మార్చినట్టు ఆర్థికశాఖ అధికారులు గురువారం విద్యాశాఖకు సమాచారమిచ్చారు.

గ్రీవెన్స్ కోసం 'ఈజీ యాప్'

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : విద్యాశాఖలో వినతులు, సూచనల స్వీకరణను ఇక నుంచి ఆన్‌లైన్‌లో చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు ఈజీయాప్‌ను తయారు చేయిస్తున్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెల్ (ఎన్ఐసీ) విభాగానికి ఈ యాప్ తయారీ బాధ్యతలప్పగించారు.

మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- ఉచిత బస్సులతో తగ్గిన గిరాకీ
- కిస్తీలు కట్టలేక బలవన్మరణం

అడవిదేవులపల్లి, జనవరి 25: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న క్రమంలో ఫైనాన్స్ వేధింపులు ఎక్కువై ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఏకుల ఉపేందర్ (24) ప్రైవేటు ఫైనాన్స్‌లో ప్యాసింజర్ ఆటో తీసుకున్నాడు. రోజూ అడవిదేవులపల్లి నుంచి మిర్యాలగూడ రూట్‌లో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేకుండా పోయింది. దాంతో ఉపేందర్ ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాడు. ఆటో నెలవారీ వాయిదాలు చెల్లించాలని ఫైనాన్స్ వారు ఒత్తిడి చేయడంతో మనోవేదనకు గురయ్యాడు. బుధవారం రాత్రి తన ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంబాన్ని ఆదుకుంటాడనుకుంటే ఆత్మహత్య చేసుకుండని ఉపేందర్ తల్లి ఏకుల లింగమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఇంతకాలం ఆటో నడిపి తెచ్చిన డబ్బుతో ఇల్లు గడిచేదని, బస్సుల్లో మహిళలను ఉచితంగా తీసుకెళ్తుండటంతో నెల రోజుల నుంచి ఇల్లు గడవడం కష్టమైందని చెప్పింది. మార్పు రావాలని తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల తన కొడుకు ప్రాణాలు కోల్పోయాడని రోదించింది. మిర్యాలగూడ ఏరియా దవాఖానలో మృతుడి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య

హైదరాబాద్ నాచారంలోని టీఏటీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న వేముల మారయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి, తమ కుటుంబాలను ఆదుకోవాలని టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఊపిరి ఆపుకునే పరిస్థితులు వచ్చి నా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఉపేందర్ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మారయ్య నాచారంలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. పూట గడవక ఒక్కో ఆటో డ్రైవర్ తనువు చాలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల చొప్పున చెల్లించాలని కోరారు. ప్రభు త్వం స్పందించకుంటే భవిష్యత్తు కార్యాచరణను రూపొందించి, పోరాడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో రమేశ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న ఆటోల బంద్

హైదర్‌గూడలో మాట్లాడుతున్న మహ్మద్ అమానుల్లాఖాన్

హిమాయత్‌నగర్, జనవరి 25: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరుతూ ఫిబ్రవరి 15న ఒక రోజు ఆటోల బంద్ నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ వెల్లడించారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేరోజు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని కోరారు. ఉపాధి కోల్పోయిన డ్రైవర్ల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు న్యాయం జరిగే వరకు పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు మహ్మద్ అజీముద్దీన్, మహ్మద్ దస్తగీర్, ఎస్‌కే మాము, అమర్ సుల్తాన్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు డీఎంఈల మెరిట్ జాబితా విడుదల

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): సవరించిన అడిషనల్ డీఎంఈల మెరిట్ జాబితాను వైద్యారోగ్యశాఖ విడుదల చేసింది. అభ్యంతరాలుంటే ఈ నెల 29లోపు అందజేయాలని డీఎంఈ త్రివేణి గురువారం ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం డీఎంఈ, డీఎంఈ (అకడమిక్) పోస్టుల్లో ఇంచార్జీలు కొనసాగుతున్నారు. సీనియార్టీని పక్కనబెట్టి జూనియర్లను డీఎంఈలుగా నియమించడంపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు వచ్చే నెల 5న విచారణ చేపటనున్నది.

వంశీచంద్‌వి అసత్య ఆరోపణలు

- స్థాయిని పెంచుకునేందుకే ఇలా మాట్లాడారు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 25: స్థాయిని పెంచుకునేందుకే సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. గతంలో పీసీసీ అంతర్గత సమావేశంలో తాను కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు రూ.15 కోట్లు డిమాండ్ చేసినట్టు ఆరోపించడం సరికాదని చెప్పారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తే మహబూబ్‌నగర్ ప్రజలు గుర్తిస్తారనే వంశీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయమై చర్చించడానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద నాయకులందరినీ తీసుకొని ఎప్పుడు.. ఏ ప్రాంతానికి.. ఏ దేవాలయానికి వస్తావో చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తననే తేదీ ఖరారు చేయమంటే చేస్తానని, తాను చెప్పిన రోజు హాజరవుతానని సవాల్ చేశారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. దేశ భవిష్యత్తును మార్చేది యువతనే అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజానీకానికి బీజేపీ బద్ధ శత్రువు

సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తెలుగు ప్రజానీకానికి బీజేపీ బద్ధ శత్రువుగా మారిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకే ఆ పార్టీ శత్రువు అని, దాని వల్ల రెండు ప్రాంతాల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీది ధ్రుతరాష్ట్ర కౌగిలి అని విమర్శించారు. దేశంలోని కొందరు రాజకీయ నాయకులు సెక్యులర్ అని చెప్పుకొని బీజేపీకి ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి అయోధ్య రామాలయ ప్రారంభాన్ని ఒక ఈవెంట్‌లాగా చేశారని విమర్శించారు. బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తశుద్ధిగా పనిచేసే పార్టీలను ఇండియా కూటమిలో కలుపుకొని ముందుకు వెళ్లాలని నారాయణ కోరారు.

మూడేండ్ల సర్వీస్ దాటిన డిప్యుటేషన్లు రద్దు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : ఎస్సీఈఆర్టీలో డిప్యుటేషన్ల రద్దుపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. మొత్తం సర్వీస్‌లో ఎస్సీఈఆర్టీలో మూడేండ్ల డిప్యుటేషన్, ఫారిన్ సర్వీస్, ఆన్‌డ్యూటీలను కూడా రద్దుచేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తాజాగా ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే డిప్యుటేషన్‌పై రెండేండ్లు, ఆన్‌డ్యూటీపై ఏడాదికి పైగా ఎస్సీఈఆర్టీలో పనిచేస్తున్న వారిని ఆయా స్థానాల నుంచి పాత స్థానాలకు పంపాలని ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే.

టెట్ ఆన్‌లైన్‌లో!

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)ను ఆన్‌లైన్‌లో నిర్వహించే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ పరీక్షను ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తుండగా, ప్రభుత్వం అన